

రుణమాఫీ.. రైతే హ్యాపీ



- ఒకేసారి రూ.2 లక్షల మాఫీకి ప్రభుత్వం కసరత్తు
- ఆనందం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు
- ఆగస్టు 15వ తేదీలోపు రైతులకు చెల్లించేందుకు ప్రణాళిక
- అర్హతలపై మార్గదర్శకాలు రూపొందిస్తున్న సర్కారు
- పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం విధివిధానాలపై అధ్యయనం
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 8.90లక్షల మందికి రైతుబంధు పథకం
- 3.82లక్షల మందికి సమ్మాన్ నిధి ద్వారా పెట్టుబడి సాయం
- రుణమాఫీకి సుమారు రూ.8వేల కోట్లు అవసరంగా అంచనా

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

రైతు రుణమాఫీపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. పంద్రాగస్టులోపు రైతులకు రూ.2లక్షల రుణాన్ని ఒకే విడతలో మాఫీ చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తోంది. గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రైతు రుణమాఫీపై హామీ ఇచ్చింది. దీంతో ఉమ్మడి వరంగల్‌లో సుమారు 8లక్షల మంది రైతులకు సుమారు రూ.8వేల కోట్ల వరకు రుణమాఫీ జరుగవచ్చునని అధికారులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. అయితే రుణమాఫీని ఎలా చేయాలనే దానిపై మార్గదర్శకాలు రూపొందించేందుకు ప్రభుత్వం ఓ కమిటీని నియమించింది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం కిసాన్ సమ్మాన్ నిధి (పీఎంకేఎస్) పథకంలోని విధివిధానాలపై అధ్యయనం చేస్తున్నారు. కొన్ని మార్పులు, చేర్పులతో అర్హులైన ప్రతీ రైతుకు రుణమాఫీ చేయాలని ప్రభుత్వం ప్రయత్నిస్తుండటంతో ఓరుగల్లు అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

డిసెంబరు 9వ తేదీ కటాఫ్

ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా రైతులకు రూ.2లక్షల రుణమాఫీకి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. పంద్రాగస్టులోపు పక్కాగారూ.2లక్షల రుణమాఫీ చేయాలనే పట్టుదలతో ప్రభుత్వం ఉంది. దీనిపై ఇటీవల జరిగిన మంత్రి వర్గ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి మంత్రిమండలి ఉపసంఘాన్ని కూడా నియమించారు. ఉపసంఘానికి రుణమాఫీపై పలువురు నుంచి పలు ప్రతిపాదనలు వస్తున్నాయి. అలాగే రూ.2లక్షల రుణమాఫీకి 2018 డిసెంబరు 12వ తేదీ నుంచి 2023 డిసెంబరు 9వ తేదీని కటాఫ్‌గా నిర్ణయించారు. ఈ మధ్యకాలంలో రుణం తీసుకున్న రైతులకే రుణమాఫీ చేయనున్నారు. ఈ ఐదేళ్లలో రైతులు తీసుకున్న రుణంపై వడ్డీని కూడా లెక్కించి మొత్తంగా రూ.2లక్షల వరకు మాఫీ చేయనున్నారు. ఆపైన ఉన్న మొత్తాన్ని రైతులే బ్యాంకులకు చెల్లించాల్సి ఉంటుంది. గోల్డ్ లోనులను మాత్రం ఎట్టి పరిస్థితుల్లో మాఫీ చేసే అవకాశం లేదని సమాచారం.

విధివిధానాలపై ప్రభుత్వం కసరత్తు

పంద్రాగస్టులోపు రుణమాఫీ చేయాలని తీవ్ర కసరత్తు చేస్తున్న సర్కారు.. ఎవరికి వర్తింపజేయాలనే దానిపై తర్జనభర్జన పడుతోంది. వివిధ వర్గాల నుంచి ప్రభుత్వానికి పలు ప్రతిపాదనాలు వస్తుండగా.. ప్రధానంగా ఆదాయపన్ను చెల్లిస్తున్నవారు, ప్రభుత్వ ఉద్యోగులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కూడా రుణమాఫీ నుంచి తొలగించే అవకాశాలున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఐదెకరాల రైతులకు మాత్రమే రుణమాఫీ వర్తింపజేయాలనే ప్రతిపాదనలు కూడా వస్తున్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం విధివిధానాలపైనా అధ్యయనం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. పూర్తి విధివిధానాలను కాకపోయినా కొన్నిటిని అయినా పరిగణనలోకి తీసుకుంటునే ఆలోచనలో ఉన్నట్టు సమాచారం. మరో వైపు తెల్ల రేషన్‌కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకాలను ప్రామాణికంగా తీసుకుని లబ్ధిదారుల జాబితా తయారు చేయాలని కూడా ప్రభుత్వం అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్టు సమాచారం. ఒక ఇంట్లో ఒక్కరికే రుణమాఫీ వర్తిస్తుందని ప్రచారం జరుగుతుండగా.. ఇందుకోసం రేషన్‌కార్డు, ఆధార్‌కార్డులను ప్రామాణికంగా తీసుకోవాలని నిర్ణయించినట్టు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

వివరాల సేకరణలో అధికారులు

కాంగ్రెస్ అధికారం చేపట్టిన ఆరు నెలల్లోనే రుణమాఫీకి అడుగులు వేస్తుండటంతో అన్నదాతల్లో ఆనందం వ్యక్తమవుతోంది. అయితే పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం విధివిధానాలను పరిగణనలోకి తీసుకుంటే చాలా తక్కువ మందికి రుణమాఫీ జరుగుతుందని, అదే రైతుబంధు విధివిధానాలైతే అత్యధిక రైతులకు ప్రయోజనం చేకూరుతుందని లెక్కలు చెబుతున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద 3,81,890 మంది రైతులు లబ్ధిపొందుతుండగా వీరికి ఇటీవల కేంద్ర ప్రభుత్వం రూ.76,37,80,000 పెట్టుబడి సాయాన్ని అందించింది. అదే రైతు బంధు పథకం కింద అయితే 8,89,787మంది రైతులకు రూ.907.93కోట్ల సాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది. ఈ క్రమంలో రైతుబంధు విధివిధానాలను కొంచెం మార్పులు, చేర్పులు చేసి అమలు చేస్తే ఉమ్మడి జిల్లాలో 8,89,787మంది రైతులు లబ్ధిపొందుతారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వీరికి సుమారు రూ.8వేల కోట్ల వరకు రుణమాఫీ జరిగే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో సహకార బ్యాంకులతో పాటు జాతీయ బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న రైతుల జాబితాను సిద్ధం చేస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 34 సహకార బ్యాంకుల్లో 78,432మంది రైతులకు రూ.529.44కోట్ల రుణమాఫీ కానుండగా ఇప్పటికే డీసీసీబీ బ్యాంకు అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. అలాగే జాతీయ బ్యాంకుల్లో కూడా వివరాలను సేకరిస్తుండగా.. త్వరలోనే రూ.2లక్షల రుణమాఫీ లబ్ధిదారుల లెక్క తేలనుంది.

అన్నదాతల్లో ఆనందం

వానాకాలం సాగు ప్రారంభం కావటంతో ఇటీవల కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద ఉమ్మడి వరంగల్ జిల్లాలో 3,81,890మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.76కోట్ల37లక్షల80వేల రుపాయలను జమ చేసింది. అలాగే రాష్ట్ర ప్రభుత్వం రైతుబంధు పెట్టుబడి సాయాన్ని కూడా పెంచబోతోంది. జూలై మొదటి వారంలో వానాకాలం పెట్టుబడి సాయం అందించనుంది. గత ప్రభుత్వం ఎకరానికి రూ.5వేల చొప్పున వానాకాలం, యాసంగి పంటలకు రూ.పదివేల అందించింది. అయితే తాము అధకారంలోకి వస్తే రూ.15వేలు ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిన విషయం తెలసిందే. ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో పెట్టుబడి సాయం ఎకరానికి రూ.15వేలు అందనుంది. జూలైలో ఈ సాయాన్ని రైతుల ఖాతాలో వేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. 2023-24 యాసింగిలో రైతుబంధు పథకం కింద ఉమ్మడి వరంగల్ జిల్లాలో 8,89,787మంది రైతులకు రూ.907.93కోట్ల నిధులు బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. ఈసారి ఈ మొత్తం రూ.1,350కోట్లకు పెరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం. మొత్తానికి రూ.2లక్షల రుణమాఫీతో పాటు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే పెట్టుబడి సాయం పెరుగుతుండటంతో అన్నదాతల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

ఉమ్మడి జిల్లాలో రైతుబంధు, పీఎం కిసాన్‌సమ్మాన్ నిధి ద్వారా లబ్ధిపొందుతున్నరైతుల వివరాలు

జిలా	రైతుబంధు	పెట్టుబడి సాయం	పీఎంకేఎస్	పెట్టుబడి సాయం
వరంగల్	1,54,822	రూ.137.46కోట్లు	65,361	రూ.13,07,22,000
హనుమకొండ	1,45,044	రూ.132.13కోట్లు	56,409	రూ.11,28,18,000
జనగామ	1,79,735	రూ.202.04కోట్లు	81,487	రూ.16,29,74,000
మహ-బాద్	2,14,685	రూ.233.07కోట్లు	90,978	రూ.18,19,56,000
భూపాలపలి	1,16,171	రూ.118.83కోట్లు	48,496	రూ.09,69.92,000
ములుగు	79,330	రూ.84.40కోట్లు	39,159	రూ.07,83,18,000
మొత్తం	8,89,787	రూ.907.93కోట్లు	3,81,890	రూ.76,37,80,000

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాల్లో

బాలికల పైచేయి

ప్రథమ సంవత్సరం 50 శాతం, ద్వితీయ 63.5 శాతం ఉత్తీర్ణత



మానుకోటలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ సదానందం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూన్ 24 : తెలంగాణ ప్రభుత్వం సోమవారం విడుదల చేసిన ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాల్లో జిల్లాలో బాలికలే ఎక్కువగా ఉత్తీర్ణత సాధించారు. జిల్లా వ్యాప్తంగా ద్వితీయ సంవత్సరంలో 1,184మంది పరీక్ష రాయగా 601(50.76 శాతం) మంది ఉత్తీర్ణులు అయ్యారని, ప్రథమ సంవత్సరంలో 2047మంది పరీక్షకు హాజరు కాగా 1031 (63.56శాతం) మంది ఉత్తీర్ణత సాధించినట్లు జిల్లా ఇంటర్ విద్యాధికారి సత్యనారాయణ తెలిపారు. గత మేలో జరిగిన పరీక్షల్లో ద్వితీయ సంవత్సరంలో జనరల్ విభాగంలో 756 మంది బాలురు పరీక్షకు హాజరు కాగా 376 (49.74 శాతం), బాలిక విభాగంలో 428కి గాను 225 (52.5 శాతం)మంది ఉత్తీర్ణత సాధించగా ఒకేషనల్‌లో 298 మంది పరీక్షకు హాజరు కాగా 166 (55.7శాతం) ఉత్తీర్ణత సాధించినట్లు వివరించారు. ప్రథమ సంవత్సరం జనరల్ బాలుర విభాగంలో 1,016మంది పరీక్షకు హాజరు కాగా 571 (56.2శాతం), బాలికల విభాగంలో 1,031మంది పరీక్షకు హాజరు కాగా 730(70.81 శాతం) ఉత్తీర్ణత సాధించినట్లు వెల్లడించారు. ఒకేషనల్ బాలుర విభాగంలో 328 మంది పరీక్షకు హాజరు కాగా 160(48.78శాతం)మంది ఉత్తీర్ణత సాధించగా, బాలికల విభాగంలో 203 మంది పరీక్ష రాయగా 140(68.95శాతం) ఉత్తీర్ణత సాధించినట్లు డీఐఈవో తెలిపారు.

విద్యార్థినులకు ప్రిన్సిపాల్ అభినందన..

మహబూబాబాద్‌లో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం అడ్వాన్స్ సప్లిమెంటరీ ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థినులు తాటి అశ్విత 425/440, డి.సౌజన్య 433/470, జాస్మిన్ 425/470, అంజలి 400/470 మార్కులతో జిల్లా ర్యాంకులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపల్ సదానందం, అధ్యాపకులు అభినందించారు.

సమస్యలపై అధికారులు స్పందించాలి

- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న యశస్విని రెడ్డి

తొర్రూరు, జూన్ 24 : ప్రజలు సమస్యలతో అధికారుల వద్దకు వచ్చినపుడు వెంటనే స్పందించి, పరిష్కారం చేయాలని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి సూచించారు. ఎలాంటి సమస్యలు వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. పాలకుర్తి నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి పనులపై సోమవారం తొర్రూరులోని క్యాంపు కార్యాలయంలో ఆయాశాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా పనుల అలసత్వంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. తొర్రూరు పట్టణంలో పెద్దచెరువు కట్ట పనులు ప్రారంభించాలని, దుబ్బతండా వద్ద నిర్మాణం పూర్తైన రెండు పడక గదుల ఇండ్లను సంబంధిత శాఖ అధికారులు స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. అనంతరం శ్మశాన వాటికలో గతంలో మంజూరైన రూ.50 లక్షలు నిధులతో పనుల నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ రాంచంద్రయ్య, వైస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, నాయకులు పెదగాని సోమయ్య, సోమ రాజశేఖర్, సంతోష్, మాజీ కో-ఆప్షన్ ఎం.డీ యాకూబ్, కౌన్సిలర్‌లు దొంగరి రేవతి శంకర్, నాగరాజు, గజానంద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మునిసిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని వినతి

మునిసిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు బొల్లం అశోక్, మునిసిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కొమ్ము దేవేందర్ మాట్లాడారు. రాష్ట్రంలో ఉన్న మునిసిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరుతూ ప్రభుత్వానికి సిఫారసు చేయాలని కోరారు. ఔట్ సోర్సింగ్ సేవలను థర్డ్ పార్టీకి అప్పగించాలనుకుంటున్న ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో దేవేందర్, శ్రీనివాస్, వెంకన్న, యాకూబ్, వెంకటరాంనర్సయ్య, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

సభ్యులు గరం.. గరం

- సమస్యలను ఏకరువు పెట్టిన వార్డుల కౌన్సిలర్లు
- అధికారుల తీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం

వాడీవేడిగా మానుకోట మునిసిపల్ పాలకమండలి సమావేశం





మానుకోట మునిసిపల్ పాలకమండలి సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, హాజరైన కౌన్సిలర్లు

మహబూబాబాద్ టౌన్, జూన్ 24 : మానుకోట పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో సోమవారం పాలకమండలి సమావేశం వాడివేడిగా కొనసాగింది. మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సాధారణ సమావేశంలో సభ్యులు తమవార్డు పరిధిలో ఉన్న సమస్యలపై ఏకరువు పెట్టారు. ప్రతీసారి కౌన్సిల్‌లో సమస్యలను చెపుకుంటున్నాం.. కానీ, పరిష్కారం మాత్రం కావడం లేదని, మళ్లీ కౌన్సిల్‌లో ఇవే సమస్యలు చెప్పుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

పాలకమండలి సమావేశ ప్రారంభంలో చైర్మన్ రాంమోహన్‌రెడ్డి పలు అంశాలను ఎమ్మెల్యే మురళీనాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు దృష్టికి తీసుకువచ్చారు. మానుకోట పట్టణ ప్రగతి నిధులు ప్రతీనెల మునిసిపాలిటీకి రూ.60లక్షల వరకు వచ్చేవని, గత కొంతకాలంగా అవి రావడంలేదని దీంతో అభివృద్ధికి నిధుల కొరత ఏర్పడుతోందని చెప్పారు. జనరల్ ఫండ్ కూడా తక్కువగా ఉండడంతో పనులు పెండింగ్‌లో పడుతున్నాయని, ప్రభుత్వం నుంచి నిధులు మంజూరయ్యేలా చూడాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. కుక్కల నివారణ కోసం ఏర్పాటు చేసిన ఎనిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) సెంటర్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు.

కౌన్సిల్ ఆమోదం లేకుండా నిధుల మళ్లింపు..

మానుకోట మునిసిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సాధారణ సమావేశంలో సభ్యులు తమ వార్డు పరిధిల్లో ఉన్న సమస్యలను సమావేశ దృష్టికి తీసుకువచ్చారు. తొలుత సీపీఐ మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్ సారథిరెడ్డి మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం మునిసిపాలిటీకి ఎన్ని నిధులు ఇచ్చింది, ఏమేమి అభివృద్ధి పనులకు ఎన్నినిధులు ఖర్చు చేశారో తెలపాలన్నారు. కౌన్సిల్ ఆమోదం లేకుండా నిధుల మళ్లింపు ఎలా చేస్తారని ప్రశ్నించారు. గత ప్రభుత్వ నిర్ణయాల వల్ల మునిసిపల్ భవన నిర్మాణం పూర్తి కాలేదన్నారు. జీవో నెంబరు 58 ద్వారా పట్టాలిచ్చిన ఇళ్లకు ఇంటి నెంబర్లు ఎందుకు ఇవ్వడంలేదని అడిగారు. కొంతమందికి ఇస్తున్నారు, మరి కొంతమందికి ఇవ్వడం లేదని.. అందులో మతలబు ఏంటని ప్రశ్నించారు.

సీపీఎం ఫ్లోర్‌లీడర్ సూర్నపు సోమయ్య మాట్లాడుతూ 14, 15వ ఆర్థిక సంఘం నిధులు దాదాపు గా రూ.2 కోట్ల వరకు పట్టణ ప్రగతికి మళ్లించారన్నారు. దీంతో 14వ ఆర్థిక సంఘం నిధులతో చేసిన పనులకు బిల్లులు చెల్లించలేక పోతున్నారని సమావేశ దృష్టికి తీసుకువచ్చారు. బస్టాండ్ సెంటర్ నుంచి రైల్వేస్టేషన్-ఏ క్యాబిన్ రోడ్ వరకు నిజాం చెరువు మీదుగా వేసిన రోడ్డును కూల్చారని, దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నిజాం చెరువును మునిసి పాలిటీ తీసుకుని వరంగల్ భద్రకాళి, ఖమ్మం లకారం చెరువుల్లా అభివృద్ధి చేయాలన్నారు. వార్డు కౌన్సిలర్ ఎడ్ల వేణు మాట్లాడుతూ పట్టణంలో గ్రీన్‌లాండ్‌లు అన్యాక్రాంతమవుతున్న అధికారులు చోద్యం చూస్తున్నారని, వాటి పరిరక్షణకు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఆయనకు మద్దతుగా వైస్‌చైర్మన్ మార్నేని వెంకన్నతోపాటు మరి కొంతమంది కౌన్సిలర్లు మాట్లాడారు. గ్రీన్ ల్యాండ్‌ల చుట్టూ ఫినిషింగ్ ఏర్పాటు చేసి పరిరక్షించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం పలువురు వార్డు కౌన్సిలర్లు తమ పరిధిలోని సమస్యలను పరిష్కరించాలని సమావేశ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన మహ బూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ మునిసిపాలిటీ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం

మిగతా 8వ పేజీలో..

పెండింగ్ పనులను పూర్తి చేయాలి

మురళీనాయక్, మానుకోట ఎమ్మెల్యే

మునిసిపాలిటీ పరిధిలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మహబూబాబాద్ శాసనసభ్యుడు భూక్య మురళీనాయక్ అన్నారు. పత్తిపాక రోడ్డువిస్తరణ పనులల్లో వేగం పెంచాలని సూచించారు. మోడల్ మార్కెట్‌లో పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తిచేసి కూరగాయాల మార్కెట్‌ను అందులోకి మార్చాలని చెప్పారు. అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అందుకు తనవంతు సహకారం ఉంటుందని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు మాట్లాడుతూ జీవో నెంబరు 58 ద్వారా పట్టాలిచ్చిన ఇళ్లకు ఇంటి నెంబర్లు ఇవ్వడానికి అభ్యంతరం ఏంటని, ఇంటి నెంబర్లు ఇవ్వడం వల్ల పన్నుల రూపంలో మునిసిపాలిటీకి ఆదాయం పెరుగుతుందని చెప్పారు.

దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

- గ్రీవెన్స్‌పై ప్రజలకు నమ్మకం కలిగించాలి
- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, జూన్ 24 (ఆంధ్రజ్యోతి) : బాధితుల నుంచి వివిధ సమస్యలపై గ్రీవెన్స్‌కు వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్‌సెల్ నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి 173 దరఖాస్తులను బాధితుల నుంచి స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రీవెన్స్‌కు వచ్చిన దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టకుండా, క్షుణ్ణంగా పరిశీలించి త్వరగా పరిష్కార మార్గం చూపాలన్నారు. గ్రీవెన్స్‌పై నమ్మకంతో ప్రజలు దూరప్రాంతాల నుంచి వస్తుంటారని, వారి సమస్యలను పరిష్కరించి, నమ్మకాన్ని పెంచాలని సూచించారు. గతంలో ఏమైనా పెండింగ్‌లో ఉంటే వాటిని కూడా పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్, జడ్పీ సీఈవో నర్మద, డీడబ్ల్యూవో వరలక్ష్మి పాల్గొన్నారు.

- ఉపాధ్యాయుల పదోన్నతుల్లో దళిత మహిళా ఉపాధ్యాయులకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి చాగంటి ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సంఘం ఆధ్వర్యంలో గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. ఈకార్యక్రమంలో కె.ఉప్పలయ్య, జి.సంజీవ, కృష్ణకుమారి, నిర్మల, మాధవి పాల్గొన్నారు.
- రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ప్రైవేట్ జూనియర్, డిగ్రీ, పీజీ కళాశాలల ఫీజు రీయింబర్స్‌మెంట్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థుల ఉపకార వేతనాలు మంజూరు చేయాలని ప్రైవేట్ జూనియర్, డిగ్రీ, పీజీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవీంద్రనాథ్, జేలి సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, సమస్యను పరిష్కరించాలని కోరినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రంజిత్‌రెడ్డి, రవినాథ్‌రెడ్డి, బిక్కి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



కలెక్టర్ కార్యాలయంలో గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న అద్వైత్‌కుమార్‌సింగ్

'సమస్యలను పరిష్కరించాలి'

- కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీల ఆందోళన

మహబూబాబాద్ టౌన్, జూన్ 24 : అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఏఐటీయూసీ అనుబంధ అంగన్‌వాడీ టీచర్స్‌అండ్‌హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించారు. తొలుత ముత్యాలమ్మ గుడిసెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రేషపల్లి నవీన్ మాట్లాడారు. 1975 నుంచి ఐసీడీఎస్‌లో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు చాలీచాలనీ వేతనాలతో పనిచేస్తూ ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ టీచర్లకు నెలకు రూ.26 వేలు, ఆయాలకు రూ.21 వేలు కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించని పక్షంలో ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ బాధ్యులు లలిత, ఎల్లమ్మ, వరలక్ష్మి, పద్మ, శారద, బీరమ్మ, జయమ్మ, స్వప్న, గీతారాణి, రాజమ్మ, రమాదేవి, ఏఐటీయూసీ నాయకులు నాగ్రా శ్రావణ్, వరిపెల్లి వెంకన్న, వెలుగు శ్రావణ్, మంద శంకర్, పెరుగు కుమార్ పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న ఏఐటీయూసీ నేతలు, అంగన్‌వాడీ టీచర్లు

గుట్కా ప్యాకెట్ల పట్టివేత

వరంగల్ క్రైం, జూన్ 24: నిషేధిత గుట్కా ప్యాకెట్లను నిల్వపెట్టుకున్న కిరాణం షాపుపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలోని రాఘవేంద్ర కిరాణం షాపులో గుట్కా నిల్వలు ఉన్నట్లు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు.. స్థానిక పోలీసులతో కలిసి సోమవారం దాడులు చేశారు. రూ. 9,780 విలువ కలిగిన సరుకును స్వాధీనం చేసుకుని విక్రయిస్తున్న యజమానిని అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ ధ్రువీకరించారు.



దాడులు చేస్తున్న పోలీసులు

బిర్యానీ సెంటర్లనూ వదలని ఖాకీలు!

పెట్రోలింగ్ పోలీసుల చేతివాటం

రాత్రి వేళల్లో బిర్యానీ పొట్లాలు, చిల్లర వసూళ్లు

వరంగల్ క్రైం, జూన్ 24: కొంతమంది పోలీసుల వైఖరితో ఆ శాఖ పరువు పోతోంది. అధికారాన్ని అడ్డుపెట్టుకుని కొందరు పోలీసు అధికారులు అందినకాడికి దండుకోవడంతో పాటు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ అడ్డంగా దొరికిపోతున్నారు. రోజువారి వసూళ్లకు తెగబడుతున్న పలువురు పోలీసులు.. చివరకు బిర్యానీ సెంటర్లను సైతం వదలడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ట్రైసిటీస్‌లో ఉన్న బిర్యానీ సెంటర్ల యజమానులు పోలీసులు వైఖరితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిసింది. రాత్రివేళల్లో పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు.. బిర్యానీ సెంటర్లను వదలడం లేదనే ఆరోపణలున్నాయి. ప్రధానంగా కాజీపేట సెంటర్, హనుమకొండ, వరంగల్ బస్టాండ్ ఏరియాల్లో పోలీసుల చేతివాటం ఎక్కువగా ఉంటోందని సమాచారం. ప్రస్తుతం నగరంలో బిర్యానీ సెంటర్ల జోరు ఎక్కువగా ఉండటంతో పోలీసులు సైతం అదే స్థాయిలో వీరి వద్ద వసూళ్లకు పాల్పడుతున్నట్లు తెలిసింది. రాత్రి వేళల్లో బిర్యానీ సెంటర్ల నుంచి ప్యాకింగ్‌లు తీసుకెళ్లడంతోపాటు వ్యాపారాన్ని బట్టి వసూళ్లు చేస్తున్నట్లు సమాచారం. ఆయా పోలీస్‌స్టేషన్‌ల అధికారులు సైతం లంచ్‌లు, డిన్నర్‌లకు బిర్యానీ సెంటర్లపై పడుతున్నట్లు తెలిసింది. స్టేషన్‌ల పరిధిలో ఉన్న పలు బిర్యానీ సెంటర్లకు ఈ నష్టం తప్పడం లేదనే ఆరోపణలున్నాయి. స్టేషన్ నుంచి వచ్చిన ఆర్డర్ అందించకుంటే ఆ బిర్యానీ సెంటర్‌కు రాత్రి వేళ పెట్రోలింగ్ సమయంలో ఇక్కట్లు తప్పవనే ప్రచారం ఉంది. డబ్బులు అడిగే పరిస్థితి ఉండదని సమాచారం. బిర్యానీ సెంటర్ల యజమానులు తెలిసిన వారివద్ద గోడువెల్లగక్కడం మినహా బయటికి చెప్పుకోలేని పరిస్థితి. నిఘా విభాగం అధికారులకు ఈ దందా గురించి తెలిసినా చూసీచూడనట్లు ఉంటున్నారనే విమర్శలున్నాయి.

విద్యుత్ అంతరాయం లేకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలి

ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

హనుమకొండ టౌన్, జూన్ 24: బ్రేక్ డౌన్, ట్రిప్పింగులు జరిగినప్పుడు విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి ఆదేశించారు. నక్కలగుట్టలోని విద్యుత్ భవన్ కార్యాలయంలో సోమవారం సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి నోడల్ ఆఫీసర్స్, సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సీఎండీ వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ.. బ్రేక్‌డౌన్, ట్రిప్పింగ్‌లు జరిగినప్పుడు ప్రతీచోట ప్రత్యామ్నాయ సరఫరా ఉండేవిధంగా చేయాలని సూచించారు. అలాగే పొడవాటి లైన్లు, ట్యాపింగ్ లైన్లు ఉన్న ప్రాంతాల్లో ఫాల్ట్ ప్యాసేజ్ ఇండికేటర్(ఎఫ్‌పీఐ)లు అమర్చాలని తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్‌లు వైఫల్యం చెందినప్పుడు వెంటనే వాటి స్థానంలో కొత్తవి మార్చాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డైరెక్టర్లు బి.అశోక్‌కుమార్, టి.సదర్‌లాల్, వి.మోహన్‌రావు, సీజీఎంలు కె.తిరుమల్‌రావు, టి.మధుసుదన్, రాజుచౌహాన్, కె.కిషన్, తదితరులు పాల్గొన్నారు.

ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 24: రెండేళ్ల డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ, డిప్లొమా ఇన్ ప్రీ ఎడ్యుకేషన్‌లో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సిందిగా డీఈవో డాక్టర్ ఎం.డి. అబ్దుల్‌హై సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు అర్హత పరీక్షలో 50 శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీ, వికలాంగులకు 45 శాతం మార్కులు ఉండాలని పేర్కొన్నారు. ఈనెల 30 వరకు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా ఆయన పేర్కొన్నారు. సెప్టెంబరు 1, 2024 వరకు అభ్యర్థులు 17 యేళ్లు నిండాలని తెలిపారు. జూలై 10న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

బాలికను వేధించిన కేసులో ఒకరికి రెండేళ్ల జైలు

వరంగల్ లీగల్, జూన్ 24: మైనర్ బాలికను పెళ్లి చేసుకుంటానని వేధించిన కేసులో నేరం రుజువైనందున పోక్సో చట్ట ప్రకారం రెండేళ్ల జైలు శిక్ష, రూ.వేయి జరిమానా విధిస్తూ హనుమకొండ జిల్లా మొదటి అదనపు సెషన్స్ జడ్జి కం పోక్సో కోర్టు న్యాయమూర్తి బి.అపర్ణాదేవి సోమవారం తీర్పు చెప్పారు. అదేవిధంగా బాధితురాలికి రూ.50వేల నష్టపరిహారం చెల్లించాలని తీర్పులో ప్రభుత్వాన్ని ఆదేశించారు. వివరాలు ఇలా ఉన్నాయి. ధర్మసాగర్ మండల కేంద్రానికి చెందిన సింగారపు దిలీప్.. తనను వివాహం చేసుకోవాలని, లేదంటే చనిపోతానని అదే గ్రామానికి చెందిన మైనర్ బాలికను వేధించేవాడు. ఈ క్రమంలో 2018 ఏప్రిల్ 29న దిలీప్ హైదరాబాద్ నుంచి ఫోన్‌చేసి హైదరాబాద్‌కు వస్తే పెళ్లి చేసుకుందామని, రాకుంటే చనిపోతానని బెదిరించాడు. ఈ విషయంపై బాధితురాలు తల్లిదండ్రులకు తెలుపగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. కేసు విచారణలో నేరం రుజువైనందున నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష, రూ.వేయి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. కోర్టు పీసీ అశోక్ సాక్షులను ప్రవేశపెట్టగా కె.పరమేశ్వరి లైజన్ అధికారిగా వ్యవహరించారు. కేసు దర్యాప్తు అధికారులుగా సీఐ ఎ.మహేందర్, ఎస్సై వి.విజయ్‌కుమార్ వ్యవహరించారు. భరోసా లీగల్‌సెల్ అధికారి సీహెచ్. నీరజ కేసుకు సహకరించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.రాజమల్లారెడ్డి కేసు వాదించారు.

మెడికల్ వార్డులో విద్యుత్ అంతరాయం

వరంగల్ మెడికల్, జూన్ 24: ఎంజీఎం ఆస్పత్రిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం తరుచూ జరుగుతూనే ఉంది. సోమవారం రాత్రి 6.30 గంటల నుంచి మెడికల్ వార్డుల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఎంఎం ఈస్ట్, ఎంఎం వెస్ట్ రోగులంతా ర్యాంపు వద్దకు చేరుకున్నారు. సుమారు 60 మంది రోగులతోపాటు వారి అటెండెంట్లు చీకట్లోనే కాలం వెళ్లదీశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఎంజీఎం ఆస్పత్రిలో తరుచూ విద్యుత్ అంతరాయం ఏర్పడటం పట్ల రోగులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

నవభారత.. సాక్షరత

- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 4.92 లక్షల మంది వయోజన నిరక్షరాస్యులు
- మొదటి విడతలో లక్ష మందిని అక్షరాస్యులను చేయాలన్నది లక్ష్యం
- ఇప్పటికే ప్రారంభమైన ప్రక్రియ
- సంపూర్ణ సాక్షరతకు ప్రత్యేక ఉల్లాస్ యాప్
- సాక్షర భారత్‌కు భిన్నంగా నవభారత్ సాక్షరత

హనుమకొండ, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): సంపూర్ణ అక్షరాస్యతలో భాగంగా వయోజనులందరినీ అక్షరాస్యులను చేయాలని కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. ఇందుకు భారత విద్యామంత్రిత్వ శాఖ నవభారత్ సాక్షరత (న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రామ్) కార్యక్రమాన్ని చేపట్టింది. చదువును మధ్యలో మానేసిన విద్యార్థులు, వయోజనులకు చదువు చెప్పాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. గ్రామాలు, పట్టణాల్లో పదిహేనేళ్లు నిండిన నిరక్షరాస్య యువతీ, యువకులను అక్షరాస్యులుగా చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. దీని అమలులో ప్రభుత్వ ఉపాధ్యాయులే కీలకపాత్ర పోషించబోతుండడం గమనార్హం. రాష్ట్రంలోని ప్రతీ ఉన్నత పాఠశాల నుంచి ప్రధానోపాధ్యాయుడు సహా ముగ్గురు ఉపాధ్యాయులను నియమించాలని నిర్ణయించారు. వీరు ఆ గ్రామ పరిధిలోని నిరక్షరాస్యులైన వయోజనులను గుర్తించి అక్షరాలు నేర్పించేలా కార్యాచరణ రూపొందిచారు.

వయోజన నిరక్షరాస్యులు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 4,92,449 మంది నిరక్షరాస్యులు ఉన్నారు. వీరిలో నవభారత సాక్షరతా కార్యక్రమం కింద 1,03,646 మందిని అక్షరాస్యులుగా చేయాలని లక్ష్యంగా నిర్ణయించారరు. హనుమకొండ జిల్లాలో 1,12,739 మంది వయోజనులైన నిరక్షరాస్యులు ఉన్నారు. వీరిలో పురుషులు 30,200 మంది కాగా, స్త్రీలు 82,539 మంది. అయితే నవభారత్ సాక్షరతా కార్యక్రమం కింద మొదటి విడతగా 19,250 మందిని అక్షరాస్యులను చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. వరంగల్ జిల్లాలో 86,228 మంది నిరక్షరాస్యులు ఉన్నారు. వీరిలో పురుషులు 30,838 మంది కాగా, స్త్రీలు 55,390 మంది. ఈ జిల్లాలో మొదటి విడతా 19,808 మంది అక్షరాస్యులను చేస్తారు. జనగామ జిల్లాలో 66,419 మంది నిరక్షరాస్యులు ఉన్నారు. వీరిలో పురుషులు 23,151 మంది కాగా, స్త్రీలు 43,268 మంది. వీరిలో నుంచి మొదటి విడత 16,075 మందిని అక్షరాస్యులను చేస్తారు. ములుగు జిల్లాలో 25,473 మంది నిరక్షరాస్యులు ఉన్నారు. వీరిలో పురుషులు 8,825 మంది కాగా, స్త్రీలు 16,648 మంది. వీరిలో మొదటి విడతా 5,046 మందిని అక్షరాస్యులను చేస్తారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 54,777 మంది నిరక్షరాస్యులు ఉండగా, వీరిలో పురుషులు 19,619 మంది, స్త్రీలు 35,158 మంది. వీరిలో మొదటి విడట 19,636 మందిని అక్షరాస్యులను చేస్తారు. మహబూబాబాద్ జిల్లాలో 1,46,813 మంది నిరక్షరాస్యులు ఉన్నారు. వీరిలో పురుషులు 55,643 మంది కాగా, స్త్రీలు 91,170 మంది. వీరిలో మొదటి విడతగా 23,831 మందిని అక్షరాస్యులను చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు.



ప్రతీ పాఠశాల నుంచి ముగ్గురు

నవభారత్ సాక్షరత కార్యక్రమాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం ప్రతీ పాఠశాల నుంచి ముగ్గురు చొప్పున ఉపాధ్యాయుల సేవలను వినియోగించుకోనున్నది. ప్రధానోపాధ్యాయుడిని అక్షరాస్యత పర్యవేక్షకుడి (లిటరసీ సూపర్వైజర్)గా ఓ ఉపాధ్యాయుడిని శిక్షకుడిగా, మరొకరు సర్వేయర్‌గా ఎంపిక చేయనున్నారు. వీరితోపాటు ఆయా గ్రామాల్లోని పొదుపు సంఘాల మహిళలు, పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను భాగస్వాములను చేయనున్నారు. వీరంతా కలిసి వయోజనులను గుర్తించి అక్షరాలు నేర్పిస్తారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 5లక్షల మంది పదిహేనేళ్లు పైబడిన వయోజన నిరక్షరాస్యులున్నారు. వీరిలో లక్ష మందిని మొదటి దశలో అక్షరాస్యులుగా చేస్తారు.

కోడ్ ముగిసింది.. ఇక జోరుగా..

ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ కూడా పూర్తికావడంతో ఈ కార్యక్రమాన్ని వేగంగా అమలు చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. వేసవి సెలవుల్లోనే ప్రారంభించి, కార్యకర్తల ఎంపిక, శిక్షణ పూర్తి చేయాలని నిర్ణయించారు. కోడ్ ముగియడంతో కార్యాచరణ మొదలు పెట్టారు. ముందుగా ప్రతీ పాఠశాల నుంచి ఎంపికైన ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తారు. ఈ తర్వాత అధిక జనాభా ఉన్న గ్రామాల్లో నిరక్షరాస్యులైన వయోజనులను గుర్తించి శిక్షణ ఇస్తారు. శతశాతం అక్షరాస్యతకు ఈ ప్రక్రియ దోహదపడుతుందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

ఉల్లాస్ యాప్

కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేసేందుకు ప్రత్యేకంగా ఉల్లాస్ (అండ్ స్టాండింగ్ ఆఫ్ లైఫ్‌లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) యాప్‌ను ప్రభుత్వం రూపొందించింది. ఉపాధ్యాయులు తమ సెల్‌ఫోన్‌లో ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని పాఠశాల కోడ్ సహాయంతో వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. ఉనికి, గుర్తింపు తదితర వివరాలు ఇందులో పొందుపరిచారు. తొలి విడతలో కొంత మందిని ఎంపిక చేసి అక్షరాలు నేర్పించేలా లక్ష్యాన్ని నిర్దేశించారు. కుటుంబసభ్యుల వివరాలు, నివాస ప్రాంతం తదితర అంశాలను పొందుపరుస్తారు. ఈ యాప్ ద్వారా ప్రాథమిక విద్య, డిజిటల్, ఆర్థిక, అక్షరాస్యత, వృత్తినైపుణ్యాలు, క్లిష్టమైన జీవన నైపుణ్యాలను అందిస్తారు. విభిన్న అభ్యాస వనరుల్లో నిమగ్నమవడానికి డిజిటల్ గేట్‌వేగా ఉపయోగపడుతుంది. ఆవాస పద్ధతిలో అధిక జనాభా ఉన్న గ్రామాలను గుర్తిస్తారు. వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో నిరక్షరాస్యులైన వయోజనులను గుర్తిస్తారు. మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో నిరక్షరాస్యులైన వయోజనులు ఎక్కువగా ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి.

కలెక్టర్లు చైర్మన్లుగా..

నవభారత సాక్షరతా కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఇప్పటికే ఆరు జిల్లాల కలెక్టర్లు విద్యాశాఖ అధికారులతో సమావేశాలు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన నవభారత్ సాక్షరతా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. నవభారత్ సాక్షరతా కార్యక్రమంలో కలెక్టర్ చైర్మన్‌గా, ఈడీవో మెంబర్ కన్వీనర్‌గా, వయోజన విద్య ఉపసంచాలకుడు లైజన్ అధికారిగా వ్యవహరిస్తారు. నవభారత సాక్షరతా పథకం అమలులో భాగంగా వివిధ రాష్ట్రాలు తమ సౌకర్యాన్ని బట్టి పేర్లను మార్చుకున్నాయి. మన రాష్ట్రంలో దీనిని ఉల్లాస్ నవభారత్ సాక్షరతగా అమలు చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 8,30,332 మంది వియోజనులను అక్షరాస్యులుగా చేయాలని లక్ష్యంగా నిర్ణయించగా, ఉమ్మడి వరంగల్ జిల్లాలో 50వేల మందిని చేయాలని నిర్ణయించారు. నవభారత సాక్షరత కార్యక్రమం అమలుకు కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40శాతం నిధులను వెచ్చిస్తుంది. జాతీయ నూతన విద్యావిధానం ప్రకారం వచ్చే ఐదేళ్లలో నవభారత సాక్షరత కార్యక్రమం ద్వారా దేశం సంపూర్ణ అక్షరాస్యత సాధించాలన్నది లక్ష్యం. వయోజన విద్యలో భాగంగా 2018 వరకు నిర్వహించిన సాక్షర భారత్ కార్యక్రమానికి భిన్నంగా వ్యక్తి సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా కొత్త కార్యక్రమాన్ని రూపొదించారు. లక్ష్యాన్ని అయిదు దశల్లో పూర్తి చేసేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించారు. 100 రోజుల్లో ఈ కార్యక్రమాన్ని పూర్తి చేసేందుకు బోధనాభ్యసన సామాగ్రి సిద్ధం చేస్తున్నారు.

ఇలా నేర్పిస్తారు..

వయోజనులకు ఇట్టే అర్థమయ్యేలా సులభంగా చదువు చెప్పనున్నారు. ప్రత్యక్ష తరగతులు, రేడియో, టీవీ సహా సెల్‌ఫోన్‌ద్వారా పాఠాలు నేర్పుతారు. ఇందుకు ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నారు. ప్రధానంగా గణితంలో చతుర్విద ప్రక్రియలు సహా జీవన సాఫల్యత గురించి మనోవిజ్ఞానపాఠాలు చెబుతారు. అలాగే నేర్చుకున్న విషయాలపై పరీక్షలు నిర్వహించి అందుకు అనుగుణంగా చర్యలు చేపడతారు. ఎంపిక చేసిన నిరక్షరాస్యులను మొదటి 100 రోజుల్లో రాయడం, చదవడం చిన్న చిన్న లెక్కలు చేయడం నేర్పిస్తారు. 150మార్కులతో తుదిపరీక్ష నిర్వహించి ఉత్తీర్ణ సాధించినవారికి ధ్రువపత్రాలు ఇస్తారు. రెండో దశలో క్రిటికల్ లైఫ్ స్కిల్స్‌లో భాగంగా ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ పరిజ్ఞానం, చట్టాలపై అవగాహన పెంచేలా శిక్షణ ఇస్తారు. ఆరోగ్య పరిరక్షణ, పిల్లల పోషణ, విద్య, కుటుంబ సంక్షేమంపై అవగాహన కల్పిస్తారు. మూడోదశలో 3-5 తరగతులు ప్రాథమిక విద్యగా, 6-8 తరగతులు మాధ్యమిక విద్యగా, 9-12 తరగతులను సెకండరీ విద్యగా అందించేందుకు చర్యలు తీసుకుంటారు. నాలుగో దశలో వృత్తి నైపుణ్యాలు పెంపొందించే శిక్షణ ఇచ్చి, స్థానికంగా ఉపాధి అవకాశం కల్పిస్తారు. అయిదు దశలో శిక్షణ పొందిన వారితో స్వయం సహాయక సంఘాలు, వివిధ సంస్థలు ఏర్పాటు చేసుకొని అభివృద్ధి చెందేలా ప్రోత్సాహం అందిస్తారు.

లక్షమంది అక్షరాస్యులుగా చేయడమే లక్ష్యం

టి. రమేష్‌రెడ్డి, ప్రాజెక్టు ఆఫీసర్, వయోజన విద్య



ఉమ్మడి వరంగల్ జిల్లాలో 4.92 లక్షల మంది నిరక్షరాస్యులున్నారు. మొదటి విడతగా లక్షమందిని అక్షరాస్యులను చేయాలన్నది లక్ష్యం. నవభారత్ సాక్షరతా కార్యక్రమం వచ్చే నెల నుంచి ప్రారంభం కానున్నది. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. గతంలో సాక్షరతా మిషన్‌కు భిన్నంగా ఈ కార్యక్రమం పూర్తిగా ఉపాధ్యాయుల భాగస్వామ్యంతో పూర్తిగా స్వచ్ఛంద కార్యకర్తల సహకారంతో అమలవుతుంది. పాఠశాల, కళాశాల విద్యార్థులను సైతం ఇందులో భాగస్వాములను చేస్తాం. ఇందుకు సంబంధించిన స్టడీ మెటీరియల్ కూడా సిద్ధమైంది. నవభారత్ సాక్షరతా కార్యక్రమంలో విద్యావంతులైనవారు, విద్యార్థులు అక్షరాస్యులైన ప్రతీ ఒక్కరు పాల్గొని విజయవంతం చేయడం ద్వారా మన దేశాన్ని సంపూర్ణ అక్షరాస్యతగా మార్చాలి.

ప్రమాదపుటంచున లక్నవరం చెరువు

- తూములో కూలిన రాళ్లు
- మరమ్మతులు చేయిస్తున్న నీటిపారుదల శాఖ



నీళ్లు లేక వెలవెలబోతున్న లక్నవరం సరస్సు

గోవిందరావుపేట, జూన్ 24: ఉయ్యాల వంతెనలు, మధ్యలో దీవులు, చుట్టూ పచ్చని కొండలతో ప్రకృతి రమణీయతకు నిలువుటద్దంగా ఉండే ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రఖ్యాత పర్యాటక ప్రాంతం లక్నవరం సరస్సు ప్రమాదంలో పడింది. తూము లోపలి భాగంలో రాళ్లు కూలిపడగా.. ఇటీవల ఆ విషయాన్ని గుర్తించిన నీటిపారుదల శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేస్తున్నారు. కాకతీయుల కాలంలో నిర్మితమైన ఈ లక్నవరం సరస్సు 8,794ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తోంది. సుమారు 300ఏళ్లక్రితం నిర్మించినట్టుగా భావిస్తున్న తూములలో గత కొన్నేళ్లుగా లీకేజీలు ఏర్పడ్డాయి. మూడు షెట్టర్లు కలిగిన తూములో ఓ షట్టర్ లోపల రాళ్లు కూలినట్లు నీటిపారుదల శాఖ అధికారులు గుర్తించి తక్షణమే మరమ్మతు చేయకుంటే సరస్సులోకి పూర్తిస్థాయి నీటిమట్టం చేరి ఒత్తిడి పెరిగితే రాతికట్టడమైన తూము కూలిపోయే ప్రమాదముందని భావించారు. తక్షణ మరమ్మతు కోసం ప్రభుత్వానికి నివేదించగా రూ.22లక్షల నిధులు విడుదలవగా వెంటనే పనులు ప్రారంభించారు. పూర్తిగా రాతితో నిర్మించిన తూమును సనాతన పద్ధతిలోనే మరమ్మతు చేయాలని నిర్ణయించారు. కాకతీయుల కాలం నుంచి నైజాం పాలకుల వరకు అనేక కట్టడాలలో అవలంబించిన విధానాన్ని కొనసాగిస్తూ కూలిన రాళ్ల స్థానంలో అంతే వ్యాసార్థం కలిగిన రాళ్లను పేర్చి డంగు సున్నంతో ప్లాస్టరింగ్ చేస్తున్నారు. క్యూరింగ్ కోసం కరక్కాయ, బెల్లం కలిపిన ద్రావకాన్ని ఉపయోగిస్తున్నారు. ఈ తరహా నిర్మాణంలో అనుభవం ఉన్న తమిళనాడుకు చెందిన నిర్మాణ కార్మికులతో పనులు చేయిస్తున్నారు. వారం క్రితం ప్రారంభమైన పనులను జూన్ 30లోపు పూర్తి చేయనున్నారు. వర్షాలు కురిసి అకస్మాత్తుగా వరద ముంచెత్తితే పనులకు అటంకం కలిగే అవకాశముండగా తూముకు పై భాగంలో రింగ్ బండ్‌ను నిర్మించారు. కాగా, మరమ్మతు పనులకోసం సరస్సులోని నీటిని ఖాళీ చేయడంతో 1,945ఎంసీఎఫ్‌టీ సామర్థ్యం కలిగిన సరస్సు డెడ్ స్టోరేజీ స్థాయిలో వెలవెలబోతూ దర్శనమిస్తోంది. వారాంతపు సెలవులు, విడిది కోసం లక్నవరం వస్తున్న పర్యాటకులు కుంటలను తలపిస్తున్న సరస్సును చూసి నిరుత్సాహానికి గురవుతున్నారు. ఈ విషయమై నీటిపారుదల శాఖ డీఈ శ్రీనివాస్ స్పందించారు. 'తూము లోపల ఏర్పడిన గండిని గుర్తించి మరమ్మతు చేస్తున్నాం.. లేకుంటే భవిష్యత్‌లో పెను విపత్తు జరిగి ఉండేది. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ప్రమాణాలకు అనుగుణంగా పనులు చేస్తున్నాం. ఎప్పటికప్పుడు రాష్ట్ర ప్రభుత్వానికి పరిస్థితిని నివేదిస్తున్నాం. 25న రాష్ట్రస్థాయి పరిశీలన బృందం లక్నవరం పరిశీలనకు రానుంది. రాష్ట్రంలో తొలిసారి ప్రయోగాత్మకంగా డంగు సున్నం, కరక్కాయ, బెల్లం మిశ్రమాలతో తూముల మరమ్మతులు జరుగుతున్నాయి.. సఫలమైతే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పురాతన రిజర్వాయర్లకు కూడా ఇదే పద్ధతిలో మరమ్మతు పనులు చేసే అవకాశముంది' అని పేర్కొన్నారు.



లక్నవరం చెరువు తూముకు మరమ్మతు చేస్తున్న తమిళనాడు కార్మికులు

వయోవృద్ధులకు ప్రత్యేక వార్డు ఏర్పాటు చేయాలి



ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ వి.చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

వరంగల్ మెడికల్, జూన్ 24: ఎంజీఎం ఆస్పత్రిలో వయోవృద్ధులకు ప్రత్యేకవార్డు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించాలని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దామెర నర్సయ్య కోరారు. సోమవారం ఎంజీఎంలోని వయోవృద్ధుల విభాగాన్ని సందర్శించారు. అనంతరం వారికి అందిస్తున్న సేవలపై ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ వి.చంద్రశేఖర్‌కు వివరించారు. వయోవృద్ధుల సౌకర్యం కోసం ప్రత్యేక వార్డు ఏర్పాటు చేస్తే సౌలభ్యంగా ఉంటుందని కోరారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు నాగులగాం నరసయ్య, కార్యదర్శి తేరాల యుగందర్, కార్యవర్గ సభ్యులు గంగారపు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 24: జిల్లా ఉపాధి కల్పన, శిక్షణ విభాగం ఆధ్వర్యంలో బుధవారం ములుగు రోడ్‌లోని ఉపాధి కల్పన, శిక్షణ కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా ఉపాధి కల్పన నోడల్ అధికారి ఎం.మల్లయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు కంపెనీలకు చెందిన సుమారు 100 ఉద్యోగాల కోసం జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని స్విగ్గీ ఇన్‌స్టామార్ట్‌లో 50, జేఎస్సార్ సన్‌సిటీ గ్రూప్‌లో 50 ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ పాసైన అభ్యర్థులు జాబ్ మేళాలో పాల్గొనవచ్చునని ఆయన పేర్కొన్నారు. స్విగ్గీలో రూ.14 వేలతో పాటు రూ.3 వేల ఇన్సెంటివ్ ఉంటుందని, జేఎస్సార్‌లో ఒక్క ప్లాట్ బుక్ చేస్తే రూ.50వేలు కమీషన్ ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన 18 నుంచి 45 యేళ్ల మధ్య గల వయస్సు గల వారు 26న ఉదయం 11 గంటలకు ములుగురోడ్‌లోని ఉపాధి కల్పన, శిక్షణ కార్యాలయంలో పాల్గొనాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు 9848895937 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

'ఇంటర్ సప్లిమెంటరీ'లో శివాని జయకేతనం



ఎ.హాసిని | బి. మమత | కె. కౌషిక్ | ఎం. సుష్మిత | జి. హన్సిక

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 24: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాల్లో శివాని విద్యార్థులు జయకేతనం ఎగురవేసినట్లు కరస్పాండెంట్ టి.స్వామి చెప్పారు. ఎంపీసీ ఫస్టియర్‌లో చీర్ల సాయిజ 468 మార్కులు, కె.మాధవి 468, ఎం.యశ్వంత్, వి.అజయ్, పి.జెమిని, కె.ఆకాంక్ష, జి.తరుణ్, బి.మనీష, ఆర్.రాజ, సల్మా, ఎ.హర్షిత్ సాయిలకు 467 మార్కులు సాధించారు. బైపీసీ ఫస్టియర్‌లో ఎం.సుష్మిత జి.హన్సిక, ఎ.హాసిని, బి.మమత, కె.కౌషిక్ 437 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా స్వామి ప్రిన్సిపాళ్లు జి.సురేందర్‌రెడ్డి, వి.చంద్రమోహన్, డైరెక్టర్లు టి.రాజు, ఎస్.రమేష్, ఎ.మురళీధర్, వి.సురేష్, ఎస్. సంతోష్‌రెడ్డితో కలిసి విద్యార్థులను అభినందించారు.

విద్యుత్ ప్రజావాణికి 21 దరఖాస్తులు

హనుమకొండ టౌన్, జూన్ 24: వినియోగదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడంలో భాగంగా సోమవారం నిర్వహించిన విద్యుత్ ప్రజావాణికి హనుమకొండ, వరంగల్ సర్కిల్‌లో 21 దరఖాస్తులు వచ్చాయి. కాగా హనుమకొండ సర్కిల్‌లోని హనుమకొండ రూరల్ డివిజన్‌లో 10, టౌన్ డివిజన్‌లో మూడు, మధ్యాహ్నం నిర్వహించిన సర్కిల్ కార్యాలయంలో ఒక దరఖాస్తు వచ్చినట్లు హనుమకొండ ఎస్‌ఈ వెంకటరమణ పేర్కొన్నారు. వరంగల్ సర్కిల్‌లో 8 దరఖాస్తులు రాగా, బిల్డింగ్ విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల సమస్యలపై ఫిర్యాదు చేశారన్నారు.

మానుకోటలో చోరీ సొత్తు రికవరీ

24 గంటల్లో దొంగను పట్టుకున్న పోలీసులు

1.906 కిలోల వెండి ఆభరణాలు స్వాధీనం

వివరాలు వెల్లడించిన టౌన్ సీఐ దేవేందర్

మహబూబాబాద్ రూరల్, జూన్ 24 : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న అయ్యప్ప జూవెలరీషాపులో శనివారం రాత్రి చోరీ జరిగింది. ఈ విషయమై షాపు యాజమాని రున్వాల్ భన్సీలాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ తెలిపారు. ఆదివారం క్లూస్‌టీం, పోలీసులు చోరీ జరిగిన ప్రదేశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి వేలిముద్రలు, ఆధారాలు సేకరించారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని బుక్కబజారులో నివాసముంటున్న చత్రి విజయ్‌కుమార్ జిల్లా కేంద్రంలో గుర్ఖాగా పనిచేస్తున్నాడు. ఈక్రమంలో రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న అయ్యప్ప జూవెలరీషాపు వెనుకభాగం నుంచి పైకప్పులోని పెంకులను తీసి షాపులోకి ప్రవేశించినట్లు చెప్పారు. షాపులో ఉన్న పెద్ద, చిన్న వెండి గిన్నెలు 33, వెండి దీపపు కుందులు 10, వెండి గ్లాసులు 15, చిన్న చెంచాలు 3, వెండి ప్లేట్‌లు 3, కుంకుమ వేసుకునే నాలుగు గిన్నెల సెట్‌లు 2 వెరసి మొత్తం 1.906 కేజీల వెండి అభరణాలను చోరీ చేసినట్లు చెప్పారు. వాటిని ప్లాస్టిక్ సంచిలో తీసుకుని వరంగల్‌లో విక్రయించేందుకు వెళ్తుండగా ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసుల సహకారంతో ఉదయం పాత నేరస్తుడైన చత్రి విజయ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం చేసినట్లు అంగీకరించాడు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంతో పాటు డోర్నకల్ ప్రాంతాల్లో పలు దొంగతనాలు చేసి జైలుకు వెళ్లాడని, నేరం రుజువు కావడంతో శిక్ష అనుభవించి ఇటీవలే బయటకు వచ్చినట్లు చెప్పారు. ఆ తర్వాత జూవెలరీషాపులో చోరీ చేసినట్లు చెప్పారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించి నిందితుడిని పట్టుకున్న టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్, ఎస్సై బి.విజయ్‌కుమార్, సీఆర్పీ, జీఆర్పీ పోలీసులను మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ అభినందించారు.



మహబూబాబాద్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో చోరీ వివరాలు వెల్లడిస్తున్న టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్



7వ బ్లాకులో షీట్‌ఫైల్ అమరిక పనులు

మేడిగడ్డ బ్యారేజీ వద్ద కొనసాగుతున్న మరమ్మతులు

పూర్తయిన సీసీ బ్లాకుల పునరుద్ధరణ

వర్షంతో అన్నారం సరస్వతి బ్యారేజ్ మరమ్మతు పనులకు ఆటంకం

మహదేవపూర్ రూరల్ / మహదేవపూర్, జూన్ 24 : కుంగిన మేడిగడ్డ బ్యారేజీలోని 7వ బ్లాకులో చేపట్టిన తాత్కాలిక మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. సీసీ బ్లాకుల పునరుద్ధరణ పనులు పూర్తి కాగా షీట్‌ఫైల్ అమరిక పనులు పూర్తి కావచ్చాయి. బ్యారేజీకి దిగువన సీసీబ్లాకులతో పాటు దాని కింద ఉన్న కంకర రాళ్లపై ఐరన్ నెట్ వేసే పనులు కొనసాగుతున్నాయి. మట్టినమూనాల సేకరణతో పాటు గ్రౌటింగ్ పనులు కొసాగుతున్నాయి.

సరస్వతి బ్యారేజీ పనులకు ఆటంకం

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన సరస్వతీ బ్యారేజీకి బుంగలు ఏర్పడిన నేపథ్యంలో మరమ్మతు పనులు జరుగుతుండగా సోమవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి ఆ పనులకు ఆటంకం కలిగింది. పుణేకు చెందిన కేంద్ర జల, శక్తి పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తల బృందం నాలుగు రోజులుగా చేస్తున్న పరిశోధనలను నిలిపేసి సుందిళ్ల వద్ద నిర్మించిన పార్వతీ బ్యారేజీకి వెళ్లారు. వాస్తవానికి ఆ బృందం మరోవారం రోజుల పాటు సరస్వతీ బ్యారేజీ వద్దే ఉండాల్సి ఉండగా పనులకు ఆటంకం కలగడంతో వారు సుందిళ్లకు వెళ్లాల్సి వచ్చింది. లీకేజీలు, సీపేజీలు లేకుండా చేయడానికి కెమికల్ గ్రౌటింగ్ తోపాటు జియోఫిజికల్ పరీక్షలకు ఆటంకం కలిగింది. కేవలం డ్రిల్లింగ్ పనులు మాత్రమే జరుగుతున్నాయి.

ప్రతీ ఒక్కరు సమయపాలన పాటించాలి : డీఈవో

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూన్ 24 : ప్రతీ ఒక్కరు సమయపాలన పాటించాలని జిల్లావిద్యాశాఖ అధికారి రామారావు అన్నారు. మహబూబాబాద్‌లోని డీఈవో కార్యాలయంలో సోమవారం కార్యాలయ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించవద్దని, సమయ పాలన పాటిస్తూ విధులు నిర్వహిస్తూ, నిర్ధీత సమయానికంటే ఆలస్యంగా వచ్చే ఉద్యోగులు రిజిస్టర్ అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ డైరెక్టర్ రాజేశ్వర్‌రావు, ఏసీజీఈ మందుల శ్రీరాములు, జీసీడీవో విజయకుమారి, సీనియర్ అసిస్టెంట్ షాబీర్‌అలీ, ఏస్వో సంతోష్, సూపరిండెంట్ సురేష్, సమద్ పాల్గొన్నారు.


సిబ్బందితో మాట్లాడుతున్న డీఈవో రామారావు

డీసెట్ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం..

డిప్లమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కోర్సుల 'ఆన్‌లైన్' పరీక్ష కోసం అర్హులైన అభ్యర్థులు ఈనెల 30 వరకు దరఖాస్తు చేసువచ్చని జిల్లా విద్యాశాఖాధికారి రామారావు తెలిపారు. డిప్లమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ అండ్ డిప్లమా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ (డీఈఈసెట్) రెండు సంవత్సరాల కోర్సు ఉంటుందని డైట్ కళాశాల ఏయిడెడ్, అన్‌ఎయిడెడ్, మైనార్టీ కళాశాల నందు ప్రవేశాలు ఉంటాయన్నారు. ఈ పరీక్ష జూలై 10న ఉంటుందని తెలిపారు. ఎడిట్ ఆప్షన్ ఈనెల 26 నుంచి 30 వరకు ఉంటుందన్నారు. ఇతర వివరాలకు http:// deecet.telangana.gov.in సైట్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి చేయాలి : కలెక్టర్

మహబూబాబాద్, జూన్ 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సమగ్రాభివృద్ధికి అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జిల్లా అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూఎన్నికల నిర్వహణలో జిల్లా అధికారులు అహర్నిశలు కృషి చేసి ఎన్నికలను విజయవంతం చేసిన ప్రతీ ఒక్కరిని అభినందించారు. అధికారులు విధినిర్వహణలో సమయ స్పూర్తితో వ్యవహరిస్తూ ప్రజలకు జవాబుదారిగా ఉండాలన్నారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ హాస్టళ్ల పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో విద్యార్థినీ, విద్యార్థులకు వైద్య పరీక్షలు విధిగా నిర్వహించాలన్నారు. పల్లెలు పరిశుభ్రంగా ఉండాలని అందుకు పంచాయతీ కార్యదర్శులను పురమాయించాలని డీపీవో హరిప్రసాద్‌కు సూచించారు. ఎంపీడీవోలు తరుచూ వారి విధినిర్వహణలో భాగంగా ప్రజా సంక్షేమమే పరామవధిగా భావించి వారికి దిశానిర్దేశం చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని జడ్పీ సీఈవో నర్మదకు సూచించారు. రైతులకు ఎరువులు, విత్తనాల సరఫరాపై ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, క్షేత్రస్థాయిలో రైతులతో సమీక్షలు నిర్వహించి రైతుకు పంటలపైన అవగాహన కల్పించాలన్నారు. పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని పాఠశాలల్లో విద్యాబోధన ఉండేలా దిశా నిర్దేశం చేయాలని డీఈవో రామారావును ఆదేశించారు.

రెడ్యాల ఆశ్రమ పాఠశాల తనిఖీ

మహబూబాబాద్ రూరల్ : రెడ్యాల గిరిజన, ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలను సోమవారం రాత్రి జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల మొత్తం పరిశీలించి విద్యాబోధన ఎలా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలల్లో పూర్తిస్థాయిలో వీధిలైట్లు ఏర్పాటు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలలో 370 మంది విద్యార్థులకు గాను 220 మంది ఉండడం ఉపాధ్యాయులను ఏమిటని ప్రశ్నించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి వారిని త్వరగా పాఠశాలకు వచ్చే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. పాఠశాల పరిసర పరిశుభ్రంగా ఉంచడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని, శుద్ధి చేసిన తాగునీరు అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పీడీ మోహన్ నాయక్, రమేష్, శ్రీకాంత్ ఉన్నారు.


రెడ్యాల గిరిజన ఆశ్రమ బాలుర వసతి గృహంలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

విద్యుత్ మోటార్ చోరీ

నెల్లికుదురు, జూన్ 24 : బావిలోని విద్యుత్ మోటార్ చోరీ చేసిన వ్యక్తులను గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆలేరు గ్రామానికి చెందిన రైతు చీకటి బీరయ్య సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా బీరయ్య మాట్లాడుతూ ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు బావినీళ్లలో ఉన్న విద్యుత్‌మోటర్‌తో పాటు విద్యుత్ తీగలను చోరీ చేశారని, దీంతో రూ.50 వేలు నష్టం జరి గిందని చోరీకి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీస్‌లను కోరాడు.

27న మోడల్‌స్కూల్ 6వ తరగతికి ప్రవేశ పరీక్ష

నెల్లికుదురు, జూన్ 24 : మోడల్‌స్కూల్‌లో ఖాళీగా ఏర్పడిన 6, 7వ తరగతి సీట్లకు ఈనెల 27న ప్రవేశ పరీక్ష నిర్వహించి, భర్తీ చేయనున్నట్లు సోమవారం ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలలో పాల్గొన్న విద్యార్థులకు 28న ఫలితాలు ప్రకటించి, మెరిట్ విద్యా ర్థులతో సీటు భర్తీ చేయనున్నట్లు వివరించారు. ఈ అవకాశాన్ని మండలంలోని అన్నిగ్రామాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికలు

కేసముద్రం, జూన్ 24 : కేసముద్రం స్టేషన్ జడ్పీ హైస్కూల్లో సోమవారం కేసముద్రం, ఇనుగుర్తి మండలాలకు చెందిన విద్యార్థులకు స్పోర్ట్స్ స్కూల్ ఎంపిక కోసం నిర్వహించిన మండలస్థాయి పోటీలను హెచ్‌ఎం రాజు ప్రారంభించారు. 10 మంది విద్యార్థులు హాజరుకాగా ఎంపికైన వారు ఈనెల 29న మానుకోటలో జరిగే జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని హెచ్‌ఎం తెలిపారు. పీఈటీలు కొమ్ము రాజేందర్, శంకర్, విజయ్‌చందర్, పద్మ, రామన్న, జి.శ్రీనివాస్, ఎండీ.నసీరొద్దిన్, మధుకర్ పాల్గొన్నారు.

'రుణమాఫీ చారిత్రాత్మక నిర్ణయం'

కేసముద్రం, జూన్ 24 : ఏకకాలంలో రూ.2లక్షల రైతు రుణమాఫీ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని టీపీసీసీ సభ్యుడు గుగులోత్ దస్రూనాయక్, మండల పార్టీ అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు అన్నారు. కేసముద్రం పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. డీసీసీ ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ కదిరె సురేందర్, రావుల మురళి, చిదిరాల వసంతరావు, ఎండీ.అయూబ్‌ఖాన్, ముదిగిరి సాంబయ్య, సుందర్ వెంకన్న, బనిశెట్టి వెంకటేష్, బానోత్ వెంకన్న, తరాల సుధాకర్ పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో పోలీసుల తనిఖీలు

మహబూబాబాద్ రూరల్, జూన్24 : మానుకోట రైల్వేస్టేషన్‌లో టౌన్ సీఐ దేవేందర్ ఆధ్వర్యంలో సోమవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల బ్యాగులను, వస్తువులను పరిశీలించినట్లు చెప్పారు. ఇటీవల కాలంలో జరుగుతున్న దొంగతనాలు, గంజాయి సరఫరా నేపథ్యంలో తనిఖీలు చేపట్టినట్లు చెప్పారు. ఎవరైనా అనుమానాస్పదంగా వ్యక్తులు కనబడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. తనిఖీల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

'ఆర్‌ఎంపీలు తమస్థాయికి మించి వైద్యం చేయొద్దు'

నెహ్రూసెంటర్, జూన్ 24 : గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలందిస్తున్న ఆర్‌ఎంపీ, పీఎంపీలు తమస్థాయికి మించి వైద్యం చేయొద్దని డీఎంఅండ్‌హెచ్‌వో కళావతిబాయి సూచించారు. మహబూబాబాద్‌లో సోమవారం నిర్వహించిన ఆర్‌ఎంపీ, పీఎంపీల అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామీణా వైద్యులు తమస్థాయికి మించి అబార్షన్‌లు, వైద్యం, అర్హత లేకుండా స్కానింగ్‌లు, ల్యాబ్‌సెంటర్లను నిర్వహించకూడదన్నారు. ఒక్కొరిద్దరు చేసే పనివల్ల మొత్తం వ్యవస్థకే చెడ్డపేరు వస్తుందన్నారు. వైద్యసేవలు మంచివే అంటూ స్థాయికి మించిన వైద్యం మాత్రం ప్రమాదకరమన్నారు. వైద్య ఆరోగ్యశాఖ సూచనలను ఆర్‌ఎంపీ, పీఎంపీలు తప్పనిసరిగా పాటించాలని అన్నారు. రోగనిర్ధారణ, వైద్య నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రులకు పంపించాలన్నారు. లేనిపోని రోగాల పేర్లు చెబుతూ వారిని భయాందోళనకు గురిచేసి ప్రైవేట్ ఆస్ప త్రులను ప్రోత్సహించవద్దన్నారు. వైద్యశాఖ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో అంబరీష, ఆర్‌ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్‌సొసైటీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు రవీంద్రాచారి, కళాదర్‌రాజు, నజీర్ అహ్మద్, సర్వర్, భీముడు, ఆర్‌ఎంపీలు పాల్గొన్నారు.

నాయకపల్లిలో పోడు రగడ

గూడూరు, జూన్24 : జీవనోపాధి కోసం పోడు సాగు చేసుకుంటూ జీవిస్తున్నామని నాయకపల్లి, బొల్లెపల్లికి చెందిన పోడు రైతులు తెలిపారు. రైతులు సాగు చేసుకుంటున్న పోడుభూమిలో చదును చేసి ప్లాంటేషన్ పెట్టేందుకు సోమవారం అటవీశాఖ అధికారులు ప్రయత్నిస్తున్న సమయంలో పోడు రైతులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. మహబూబాబాద్ రేంజ్ అధికారి జ్యోత్నదేవి, టాస్క్‌ఫోర్స్ రేంజ్ అధికారి రాంమ్మూర్తి, డీఆర్వో సాంబు, సెక్షన్ అధికారి బాలాజీ, బీట్ అధికారి మహేందర్ ఘటన స్థలానికి చేరుకున్నారు. హక్కు పత్రాలు ఉంటే చూపించాలని రైతులను అడిగారు. దీంతో పోడు రైతులు మాట్లాడుతూ పోడు రైతులకు మాత్ర మే హక్కు పత్రాలు ఇచ్చారని, మరికొంతమంది పోడు రైతులకు హక్కుపత్రాలు అందలేదన్నారు. అటవీశాఖ అధికారులు తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

మానుకోట లయన్స్ సామాజిక సేవలు భేష్

డిస్ట్రిక్ట్ 320-ఎఫ్ రీజియన్ ఫోర్త్‌జోన్-పీడీజీ-1 రాజేందర్‌రెడ్డి


క్లబ్ నూతన అధ్యక్షుడిగా యాళ్ల మురళీధర్‌రెడ్డికి బాధ్యతలు అప్పచెబుతున్న రాజేందర్‌రెడ్డి

మహబూబాబాద్ టౌన్, జూన్ 24 : మహబూబాబాద్ లయన్స్‌క్లబ్ 39ఏళ్లుగా సమాజహిత సేవలో అంకిత భావంతో పని చేయడం అభినందనీయమని క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320-ఎఫ్ రీజియన్ ఫోర్త్‌జోన్- పీడీజీ-1 కె.రాజేందర్‌రెడ్డి అన్నారు. మహబూబాబాద్ ఆర్‌సీ కన్వెన్షన్ హాల్‌లో లయన్స్ క్లబ్ నూతన కమిటీ ప్రమాణస్వీకారోత్సవాన్ని ఆదివారం రాత్రి నిర్వహించారు. అధ్యక్ష, కార్యదర్శులు యాళ్ల మురళీధర్‌రెడ్డి, చాడ అశోక్‌రెడ్డి, కోశాధికారి అనుమాల సిద్ధులచే ఇన్‌స్టాలేషన్ ఆఫీసర్, ఫస్ట్‌వైస్ డిస్ట్రిక్ గవర్నర్ డాక్టర్ చంద్రశేఖర్ ఆర్య ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ మానుకోట క్లబ్ అనేక పర్మినెంట్ ప్రాజెక్టులు చేస్తూ ఆదర్శంగా నిలుస్తోందని చెప్పారు. అనంతరం నూతన సభ్యులుగా నాయిని రంజిత్, పర్కాల రవీందర్‌రెడ్డి, రావుల ప్రదీప్‌రెడ్డి, కొండపల్లి కరుణాకర్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేశారు.

ఈ కార్యక్రమంలో పీడీజీ ఎం.రాజిరెడ్డి, టి.లక్ష్మీనర్సింహారావు, మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, ఎస్.సుధాకర్‌రెడ్డి, పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, సయ్యద్ హబీబ్, అనుమాల వెంకటేశ్వర్లు, రామసహాయం వెంకట్‌రెడ్డి, నాగవాణి, రావుల రవిచందర్‌రెడ్డి, కొండపల్లి కేవశరావు, మాదవపెద్ది వెంకట్‌రెడ్డి, ఎస్.శ్రీనివాస్‌రెడ్డి, మాలె.కాశీనాథ్, కేఎస్‌ఎన్.రెడ్డి, సనాతనచారి, బవిరిశెట్టి నాగేశ్వర్‌రావు, వైద్యులు వి.జగన్మోహన్‌రావు, ఎం.అర్జున్‌రెడ్డి, దేవిరెడ్డి, ప్రమోద్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, బానోత్ నెహ్రూరాథోడ్, భీంసాగర్, అనిల్‌గుప్తా, రంజిత్‌రెడ్డి, చంద్రశేఖర్, పాల్గొన్నారు.

'హెచ్‌పీ గ్యాస్ వినియోగదారులు ఈకేవైసీ చేయించుకోవాలి'

మహబూబాబాద్ టౌన్, జూన్ 24 : జిల్లాలోని హెచ్‌పీ గ్యాస్ వినియోగదారులంతా తప్పకుండా ఈకేవైసీ చేయించుకోవాలని హెచ్‌పీ గ్యాస్ డీలర్ జి.సురేష్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్రప్రభుత్వ కొత్త నిబంధనల ప్రకారం. ప్రభుత్వ ఉద్యోగులతో సహా వినియోగదారులందరూ ప్రస్తుతం గ్యాస్‌ను వాడుకుంటున్నట్లుగా ధ్రువీకరణ కోసం ఈకేవైసీ, వినియోగదారుల భద్రత దృష్ట్యా సెఫ్టీచెక్ చేయించుకోవాలని సూచించారు. హెచ్‌పీ గ్యాస్ ప్రతినిధులు వినియోగదారుల ఇళ్లకు వచ్చి ఈకేవైసీ, సెఫ్టీ చెక్ చేస్తారని, వారికి సహకరించాలని కోరారు. సెఫ్టీ చెక్‌చేసే సమయంలో వినియోగదారుల మొబైల్‌కు హెచ్‌పీసీఎల్ సంస్థ నుంచి వచ్చే ఓటీపీని కంపెనీ ప్రతినిధులకు తెలియజేయాలని చెప్పారు. మానుకోట జిల్లా కేంద్రంలో హెచ్‌పీ గ్యాస్ కార్యాలయానికి గ్యాస్ పాస్‌బుక్, ఆధార్‌కార్డుతో వచ్చినవారికి ఈకేవైసీ చేస్తామని వివరించారు. వినియోగదారులంతా సహకరించి ఈకేవైసీ, సెఫ్టీ చెక్ చేయించుకోవాలని సురేష్‌బాబు విజ్ఞప్తి చేశారు. సెఫ్టీ చెక్‌చేసే సమయంలో ఐదు సంవత్సరాల గడువు దాటిన ప్రతీ సురక్ష పైపును మార్చుకోవాలని, ఇందుకు గాను రూ.150 చెల్లించాలని, ఈకేవైసీ మాత్రం ఎలాంటి రుసుము లేకుండా ఉచితంగా చేయనున్నట్లు సురేష్‌బాబు చెప్పారు. ఈకేవైసీ చేయించుకోని వినియోగదారులకు గ్యాస్ సరఫరా నిలిపివేసే అవకాశం ఉందని చెప్పారు. ప్రతీ వినియోగదారుడు తన రిజిస్టర్ మొబైల్ ద్వారా గ్యాస్‌బుక్ చేసుకోవాలని సూచించారు. అలా బుక్ చేసుకున్న వారికి 24 గంటల్లోపు గ్యాస్ సరఫరా చేయబడునని సురేష్‌బాబు తెలిపారు.


పార్టీలోకి వచ్చిన వారికి కండువా కప్పుతున్న బక్కని నర్సింహులు

టీడీపీ బలోపేతం కోసం కృషి చేయాలి

● పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు

నెహ్రూసెంటర్, జూన్ 24 : తెలంగాణలో తెలుగుదేశం పార్టీ బలోపేతం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు పిలుపునిచ్చారు. టీడీపీ జెండాపండుగ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింహులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ అఖండ విజయం సాధించిందని, దాన్ని స్ఫూర్తిగా తీసుకుని తెలంగాణలోనూ పార్టీ అభివృద్ధి కోసం క్షేత్రస్థాయిలో కార్య కర్తలు సైనికుల్లా పని చేయాలన్నారు. టీడీపీని వీడిచి వెళ్లిన భూక్య సునీత మంగీలాల్‌తో పాటు మరికొంతమంది నాయకులు తిరిగి పార్టీలోకి రావ డంతో వారికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కొండపల్లి రాంచందర్‌రావు, సుతారపు వెంకటనారాయణ, అశోక్‌గౌడ్, రాంచంద్రమ్మ, సత్యనారాయణ, వెంకన్న, వీరన్న, సూర్యప్రకాష్, నర్సింగరావు, రామాచారి, నరేందర్, భీమా, సోమన్న పాల్గొన్నారు.

కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి : సీఐటీయూ


మహబూబాబాద్‌లో ఎమ్మెల్యే మురళీనాయక్‌కు వినతి పత్రాన్ని అందిస్తున్న సీఐటీయూ నాయకులు

మహబూబాబాద్ టౌన్, జూన్ 24 : మునిసిపాలిటీల్లో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులందరిని రెగ్యులరైజ్ చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు మహబూబాబాద్‌లో సీఐటీయూ అనుబంధ తెలంగాణ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మెల్యే మురళీనాయక్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఈసందర్భంగా రాజు మాట్లాడుతూ మునిసిపాలిటీ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ సేవలను థర్డ్ పార్టీకి అప్పగించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించాలని విజ్ఞప్తి చేశారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి పరిష్కరించాలన్నారు. మునిసిపల్ కార్మికుల సమస్యలపై ఈ నెల 26న కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ సూర్నపు సోమయ్య, సీఐటీయూ నాయకులు కుమ్మరికుంట్ల నాగన్న, తోట శ్రీనివాస్, మునిసిపాలిటీ వర్కర్స్ యూనియన్ నాయకులు కాంపల్లి శ్రీనివాస్, కాగితపు శ్రీనివాస్, ముత్యం మహేష్, గుర్రాల పుష్పరాజ్, జగన్, శ్రీను, వెంగల్‌రావు, కృష్ణ, శ్రీను, వెంకన్న పాల్గొన్నారు.

రేపు ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళా

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూన్ 24 : కలెక్టర్ కార్యాలయ సముదాయంలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈనెల 26న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి రామకృష్ణ సోమవారం తెలిపారు. జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో శ్రీసాయి అగ్రి టెక్నాలజీస్ కంపెనీ నందు ఫీల్డ్ స్టాఫ్‌గా మానుకోట జిల్లా పరిధిలో పనిచేయుటకు అర్హత కలిగిన నిరుద్యోగులైన స్త్రీ, పురుష అభ్యర్థులు హాజరు కావాలని సూచించారు. ఫీల్డ్ స్టాఫ్/మార్కెటింగ్ సేల్స్ ఆఫీసర్లుగా 25 ఖాళీలు ఉన్నాయని, 21 నుంచి 32 సంవత్సరాల వయస్సు . ఇంటర్ ఆపైన అర్హత ఉండి. ద్విచక్రవాహనంతో పాటు డ్రైవింగ్ లైసెన్సు ఉండాలన్నారు. జాబ్‌మేళాకు హాజరయ్యే అభ్యర్థులు విద్యార్హత సర్టిఫికెట్లతో పాటు ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్సు, 4 పాస్ ఫొటోలను వెంట తీసుకురావాలన్నారు. ఇతర వివరాలకు సెల్ నెంబర్ : 99087 68489ను సంప్రదించాలన్నారు.

క్రషర్ మిల్లును సీజ్ చేయాలని ధర్నా

కేసముద్రం, జూన్ 24 : కేసముద్రం మండలం అర్పనపల్లిలో సద్గురు కంకర క్రషర్ మిల్లును వెంటనే సీజ్ చేయాలనే డిమాండ్‌తో ఆ గ్రామానికి చెందిన పలువురు యువకులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్నా నిర్వహిస్తున్న గంధం భరత్, సంతోష్, పిట్టల మురళి, గంధసిరి సంతోష్, కంచ కట్టయ్య, వేల్పుగొండ ప్రవీణ్, బత్తుల నరేష్, బుడిగబోయిన అశోక్, పందుల సురేష్, రాకేష్, వెంకటేష్, పవన్ మాట్లాడారు. కంకర మిల్లులో బండరాళ్లను పగులగొట్టేందుకు శక్తివంతమైన బాంబులను వాడుతున్నారని తెలిపారు. సద్గురు కంకర మిల్లును వెంటనే సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ దామోదర్ వచ్చి పంచనామా నివేదికను పోలీసులకు అందజేసి చర్యలు చేపడుతామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అక్కడి నుంచి ర్యాలీగా నినాదాలు చేసుకుంటూ గ్రామానికి వెళ్లిపోయారు.

వీఆర్వోలను రెవెన్యూ శాఖలోకి తీసుకోవాలి

మరిపెడ, జూన్ 24 : పూర్వపు వీఆర్వోలను మళ్లీ రెవెన్యూ శాఖలోకి తీసుకోవాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్కే.యాకుబ్, గౌరవ అధ్యక్షుడు ఫరీద్‌బాబా రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మరిపెడ మండలంలోని పూర్వపు వీఆర్వోలు, జిల్లాలోని పలుమండలాల పూర్వపు వీఆర్వోలతో కలిసి కలెక్టరేట్‌లో కలెక్టర్ అద్వైత్‌సింగ్‌కుమార్‌ను కలుసుకొని పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందచేశారు. ఆ సంఘం జిల్లా కార్యదర్శి రాజు నాయకులు అల్లాబాస్, బికారీ, ప్రవీణ్, వెంకట్, వెంకన్న, శ్రీనివాస్, రమేశ్, వెంకటరత్నం ఉన్నారు.

రేపు బొడ్రాయి ప్రథమ వార్షికోత్సవం

కురవి, జూన్ 24 : కురవి మండల కేంద్రంలోని గ్రామ దేవత (బొడ్రాయి) ప్రథమ వార్షికోత్సవ వేడుకలను ఈ నెల 26 బుధవారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు, అర్చకుడు బుక్క వీరన్న సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 7.30 గంటలకు విఘ్నేశ్వరపూజ, గోపూజ, స్థల శుద్ధి కార్యక్రమం, మండపారాధన, హోమం నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం బొడ్రాయి దేవతకు భక్తులచే జలాభిషేకాలు, కుంభాభిషేకం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొని గ్రామ దేవత ఆశీస్సులు పొందాలని కోరారు.

గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడులు

డోర్నకల్, జూన్ 24 : డోర్నకల్ మండలం చాంప్లాతండాలో గుడుంబా స్థావరాలపై సోమవారం డోర్నకల్‌ఎస్సై సంతోష్‌రావు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించినట్లు సీఐ ఉపేందర్‌రావు తెలిపారు. ఈ దాడుల్లో ఐదు లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం. చాంప్లాతండాకు చెందిన పద్మ అనే మహిళ గుడుంబా తయారు చేస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు పేర్కొన్నారు. గుడుంబా స్వాధీనం చేసుకుని పద్మపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

పెద్దవంగర, జూన్ 24 : ప్రమాదశావత్తు విద్యుదాఘాతంతో యువకుడు మృతి సంఘటన మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలంలోని వడ్డెకొత్తపల్లి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. ఏఎస్సై విజయరాజు తెలిపిన వివరాల ప్రకారం. వడ్డెకొత్తపల్లి గ్రామానికి చెందిన కొమ్మనబోయిన కొమురయ్య లేటు కొమురమ్మ దంపతులకు ఇద్దరు సంతానం వారిలో కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఇరువురికి వివాహం కాగా, కుమారుడైన కొమ్మనబోయిన రాజు (26) తనకు ఉన్న ఐదు ఎకరాలలో వ్యవసాయం, గొర్రెలను కాస్తూ జీవనం సాగిస్తున్నాడు. రోజువారీగా వ్యవసాయ పనులను ముగించుకొని అనంతరం వ్యవసాయ పొలంలో గొర్రెలను మేపుతుండగా దాహం వేయడంతో పక్కన ఉన్న విద్యుత్ బోరు వద్దకు వెళ్లి నీళ్లు తాగే క్రమంలో బోరుకు ఉన్న ఇనుప పైపును పట్టుకోవడంతో ప్రమాదశావత్తు విద్యుత్‌షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య రవళి, 10 నెలల బాలుడు ఉన్నారు. మృతుడి భార్య రవళి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని శవపంచనామా నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. రాజు మృతితో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.


కె.రాజు (ఫైల్)

సభ్యులు గరం.. గరం

(5వ పేజీ తరువాయి)

చేశారు. కొన్ని కాలనీలకు జీవో నెంబరు 58 ద్వారా పట్టాలిచ్చి, మరికొన్ని కాలనీలకు ఎందుకు ఇవ్వలేదని అధికారులను ప్రశ్నించారు. మునిసిపాలిటీలో తీవ్ర నిర్లక్ష్యం ఉందని మండిపడ్డారు. వెజిటేబెల్ మార్కెట్ నిర్మాణం పూర్తయిందని చెప్పారు. తాను రెండుసార్లు విజిట్ చేశానని ఇంకా చేయాల్సిన పని ఉందని, ఎందుకు పెండింగ్‌లో పెడుతున్నారని అడిగారు. త్వరితగతిన మోడల్ మార్కెట్ పనులు పూర్తిచేసి, గాంధీ పార్కులోని కూరగాయాల మార్కెట్‌ను అందులోకి షిఫ్ట్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో కమిషనర్ నోముల రవీందర్, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, డీఈ ఉపేందర్, ఏఈ సురేష్, మేనేజర్ శ్రీధర్, విద్యుత్ డీఈ విజయ్, బీఆర్‌ఎస్ ఫ్లోర్‌లీడర్ చిట్యాల జనార్దన్, కౌన్సిలర్లు బానోత్ హరిసింగ్, భూక్య శ్రీను, పోతురాజు రాజు, దండెబోయిన బుజ్జి వెంకన్న, సలీం, నిమ్మల శ్రీను, యాళ్ల పుష్పలత, మార్నేని రఘు, గుండా స్వప్న, నీరజ, గోగుల అనురాధ, దౌలాగర్ స్వాతి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో పూరిగుడిసె దగ్ధం

● రూ.3 లక్షల నగదు, 7 లక్షల విలువైన సామగ్రి ఆహుతి

మరిపెడ రూరల్, జూన్24 : విద్యుదాఘాతంతో పూరిగుడిసె దగ్ధమైన ఘటన తానంచర్ల శివారు జాల్‌తండాలో సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే. మాలోతు గణేష్ ఉదయమే వ్యవసాయ పనుల కోసం పొలానికి వెళ్లారు. ఈ క్రమంలో వారు నివాసం ఉంటున్న పూరి గుడిసెలో విద్యుదాఘాతం ఏర్పడి పూరిగుడిసే దగ్ధమైంది. వ్యవసాయ పెట్టుబడుల కోసం రూ.3 లక్షలు నగదు, ఇంటిలో ఉన్న ఫ్రిజ్, ఫ్యాన్స్, బియ్యం, జొన్నలతో సహా నిత్యావసరసామగ్రి మొత్తం కాలిపోయిందని లబోదిబోమంటున్నారు. వెంటనే ఫైర్ సిబ్బంది వచ్చిన ఫలితం లేదని వారు వాపోయారు. తానంచర్ల, జాల్‌తండా వాసులు ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

కురవిలో క్షుద్రపూజల కలకలం

కురవి, జూన్ 24 : కురవి మండల కేంద్రంలో క్షుద్రపూజలు కలకలం సృష్టించాయి. గ్రామ చివరన ఉన్న కోడి నర్సయ్య ఇంటి ముందు ఆదివారం రాత్రి క్షుద్రపూజలు జరిపిన ఆనవాళ్లు ఉన్నాయి. వాటిని చూసిన ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఈ విషయమై కురవి పోలీసులకు స్థానికులు ఫిర్యాదు చేశారు.

నేడు డోర్నకల్‌కు డీఆర్‌ఎం రాక

డోర్నకల్, జూన్ 24 : దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ బర్తేష్‌కుమార్‌జైన్ మంగళవారం డోర్నకల్ జంక్షన్‌కు రానున్నారు. విజయవాడ నుంచి ప్రత్యేక రైలులో మధ్యాహ్నం డోర్నకల్ రైల్వే జంక్షన్‌కు చేరుకుంటారు. డోర్నకల్ రైల్వే రన్నింగ్ రూం, క్రూ బుకింగ్ లాబీని సందర్శించినున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. అలాగే నిర్మాణంలో ఉన్న మూడవ లైను పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో సమీక్షించనున్నట్లు చెప్పారు.

విత్తన షాపులలో తనిఖీలు

గంగారం, జూన్ 24 : బ్లాక్ మార్కెట్‌లో మొక్కజొన్న విత్తనాలు 'ఎన్‌కే 30 రకం కృత్రిమ కొరత సృష్టిస్తున్న వ్యాపారులు' అని ఈనెల 22న 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై గంగారం ఇన్‌చార్జ్ ఏవో ఉదయ్ స్పందించారు. సోమవారం గంగారంలోని ఆగ్రోస్ రైతు సేవాకేంద్రం, వెంకటేశ్వర సీడ్స్ ఓంసతీష్ షాపులలో తనిఖీలు చేపట్టారు. విత్తన భౌతిక నిలవలు, రికార్డులు, బిల్లుబుక్స్, విత్తన కొనుగోలుబిల్లులు తనిఖీలు చేయటం జరిగిందని ఏవో ఉదయ్ తెలిపారు. ఆగ్రోస్ రైతు సేవాకేంద్రంలో ఇన్‌వాయిస్ (కొనుగోలు బిల్లు) లేకపోవటంతో పయనీర్ కంపెనీకి చెందిన పీ-3302 మొక్కజొన్నరకం 93 ప్యాకెట్లు (కేజీ.3.5)అమ్మకాలు నిలిపి వేయాలని ఆదేసించినట్లు తెలిపారు. వెంకటేశ్వర సీడ్స్ షాపులో స్టాక్‌బోర్డు, లైసెన్స్ ప్రదర్శించకపోవటంతో 11 రకాల కంపెనీలకు చెందిన మొక్కజొన్న విత్తనాల అమ్మకాలు నిలిపివేయాలని ఆదేశించినట్లు చెప్పారు. ప్రతీరైతుకి కొనుగోలు రశీదు ఇవ్వాలని అన్నారు. విత్తనాలను కృత్రిమకొరత సృష్టించినా.. ఎంఆర్‌పీ కంటే అధికధరలకు విక్రయించినా వారిపైక్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రైతులు అధికధరలకు విత్తనాలు కొనుగోలు చేస్తే అమ్మిన వారిపై ఫిర్యాదులు చేయవచ్చని ఆయన తెలిపారు.

ప్రైవేటు బస్సుల ఫిట్‌నెస్‌పై తనిఖీ చేపట్టాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూన్ 24 : మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు బస్సుల ఫిట్‌నెస్‌పై తనిఖీలు చేపట్టాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కన్వీనర్ పట్ల మధు అన్నారు. ఈ మేరకు సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఆర్టీవో కార్యాలయంలో ఆర్టీవో మహ్మద్ గౌస్‌పాషా కు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మధు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గుగులోతు సూర్యప్రకాష్, గండసిరి జ్యోతిబసు, వీరేందర్, రాకేష్ పాల్గొన్నారు.